వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. అడపాదడపా వర్షాలు కురిసిన అనంతరం పల్లెల్లో జ్వర పీడితుల సంఖ్య తీవ్రంగా ఉంది. వైరల్ ఫీవర్, టైఫాయిడ్, చికున్ గున్యా, మలేరియా జ్వరాలతో మంచం పట్టిన వారు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు క్యూకడుతున్నారు. మార్కాపురం, గిద్దలూరు నియోజవకర్గాల్లోని పలు గ్రామాల్లో ప్రతి ఇంటిలో ఇద్దరు, ముగ్గురు జ్వరాలతో మంచం పట్టారు. జ్వర పీడితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్న పరిస్థితి. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పారిశుధ్య లోపంపై స్పందించడం లేదు. ఉన్నతాధికారులు చెప్పిన రోజు మాత్రం అరకొరగా పారిశుధ్య పనులు చేపట్టి మమ అనిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేసి ఇంటి వద్దకే వైద్య సేవలు అందించిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రద్దు చేయడం, ఆస్పత్రుల్లో వైద్యారోగ్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించడంలో నిర్లక్ష్యం వహించడంతో పల్లె ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందకపోగా సీజనల్ వ్యాధుల బాధితులు పెరిగిపోతున్నారు.


గిద్దలూరు ఆస్పత్రిలో మెట్ల మీద నీరసంతో కూర్చున్న విద్యార్థులు


జ్వరంతో ఆస్పత్రికి వచ్చిన ఎస్టీ హాస్టల్ విద్యార్థిని అనుషనాయక్


ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న శశిధర్


పాదిలి కమ్యూనిటీ ఆస్పత్రిలో జ్వర పీడితులు

జ్వర పీడితం.. ప్రాణ భయకంపితం!

- పల్లెలపై దోమల దండయాత్ర
- అస్తవ్యస్తంగా పారిశుధ్యం.. విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- జ్వరాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- ప్రభుత్వ పర్యవేక్షణ, ప్రత్యేక వైద్యశిబిరాల నిర్వహణ శూన్యం

గిద్దలూరురూరల్/మార్కాపురం/పాదిలి/

కొనకనమిట్ల:

ప్రత్యేక పారిశుధ్యం.. పరిసరాల పరిశుభ్రత.. దోమలపై దండయాత్రలు అంటూ ప్రభుత్వం ఆర్భాటం చేస్తోందే తప్ప ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి కరువైంది. గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. ఎక్కడికక్కడ చెత్త, మురుగు పేరుకుపోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. దోమల నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

☛ గిద్దలూరు పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో వైద్యం కోసం పడిగాపులు కాస్తున్నారు. మండలంలోని త్రిపురాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ జి.అచ్చమ్మ, పట్టణానికి చెందిన 8వ తరగతి విద్యార్థి గుల్లా శశిధర్ గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ కుమ్మరాంకట్ట సెంటర్ వద్ద అర్బన్ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. ముండ్లపాడు రోడ్డులో ఎస్టీ గరల్స్ గురుకుల వసతి గృహంలో 10వ తరగతి చదువుకుంటున్న బాణావత్ అనుషనాయక్, 6వ తరగతి చదువుతున్న పి.అక్షయ, డి.అంజలి జ్వరం బారిన పడటంతో వార్డెన్ రామయ్య పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్చి వెళ్లిపోయారు. వారిని బాగోగులు చూసేవారు లేకపోవడంతో ఇద్దరు చిన్నారులు నీరసంతో వైద్యశాల మెట్లపై కూర్చుండిపోయారు.


గిద్దలూరులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జ్వర బాధితులు

☛ రాచర్ల మండలంలోని గురుకుల పాఠశాలలో 10 మంది విద్యార్థులు వివిధ రకాల వ్యాధులకు గురవడంతో వారిని అక్కడి సిబ్బంది చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు.


గొట్లగట్టులో ప్రైవేట్ వైద్యశాలలో జ్వర పీడితులు

☛ మార్కాపురం జీజీహెచ్‌లో 20 రోజుల వ్యవధిలో సుమారు 120 మంది జ్వర పీడితులు చికిత్స పొందారు. పాదిలిలోని కమ్యూనిటీ వైద్యశాలకు టైఫాయిడ్ జ్వర పీడితులు అధికంగా వస్తున్నారు. ఉప్పలపాడు పీహెచ్‌సీలో నెల రోజుల వ్యవధిలో 15 మంది జ్వర బాధితులు చికిత్స చేయించుకున్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం

ప్రస్తుత సీజన్‌లో జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. గొట్లగట్టు, కొనకనమిట్ల ప్రాథమిక వైద్యశాలల పరిధిలోని పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

– డాక్టర్ ఎస్పీ బాలయ్య, గొట్లగట్టు పీహెచ్‌సీ

☛ కొనకనమిట్ల మండలంలోని పెదారికట్ల, పాతపాడు, గొట్లగట్టు, వెంగళపల్లి బీసీ కాలనీ, నాగంపల్లి, నాగరాజుకుంట, సిద్ధవరం గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. పాతపాడులో ఇళ్ల ముందే పేడ దిబ్బలు వేస్తుండటంతో వర్షానికి మురికి చేరి అధ్వానంగా ఉంటుంది. గొట్లగట్టులో రహదారి వెంబడి చెత్తా, చెదారం వేస్తున్నారు. ఆయా గ్రామాల్లో దోమలు విజృంభిస్తుండటంతో జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతోంది.


రోగులతో కిటకిటలాడుతున్న గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాల


కొనకనమిట్ల ప్రభుత్వ వైద్యశాలలో జ్వరాల బాధితులు

లోకనాయకునికి అన్నా ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న అన్నా రాంబాబు

మార్కాపురం: లోకనాయకుడైన వినాయకుడికి గణేష్ నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని రామలక్ష్మణ వీధి, 28వ బ్లాకుల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు చెన్నులక్ష్మి, దాసరి వెంకటేశ్వర్లు, బొగ్గరపు శేషయ్య, రహమతుల్లా, మల్లిక, ఇమ్మడిశెట్టి వీరారావు, మౌలాలి తదితరులు ఉన్నారు.


గణనాథుడి ఊరేగింపులో కోలాహలం

నిమజ్జనానికి తరలిన గణనాథులు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని బీసీ కాలనీలో 9 రోజులుగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ రోజు గురువారం వినాయక మండపం నుంచి గణనాథుడిని మేళతాళాలు, యువకుల కోలాహలం నడుమ నిమజ్జనానికి తరలించారు. మహిళలు కోలాట ప్రదర్శన గ్రామస్తులను అలరించింది.


కొనకనమిట్ల : లక్ష్మీ గణపతికి ఉభయదాతల పూజలు

రామదూత క్షేత్రంలో లక్ష్మీ గణపతి పూజలు

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో ధాన్యలక్ష్మి గణపతి స్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. క్షేత్రం వ్యవస్థాపకుడు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో పలువురు ఉభయదాతలు పాల్గొని అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం లక్ష్మి గణపతిస్వామి వారిని ధాన్యాసంలో ఉంచారు. వచ్చే ఏడాది స్వామివారిని బయటకు తీసి తొమ్మిది రోజులపాటు పూజలు చేయనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, ఒద్దుల చలమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష పూలతో గణేశునికి అర్చన

మార్కాపురం టౌన్: పట్టణంలోని కోనేటివీధిలో ఏర్పాటు చేసిన గణనాథునికి మండప నిర్వాహకులు, భక్తులు, మహిళలు వివిధ రకాల లక్ష పూలు, గరికతో గురువారం పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.


పూలతో పూజలందుకున్న గణనాథుడు

7న రక్తదాన శిబిరం

గిద్దలూరు రూరల్: భగవాన్ సత్యసాయి జయంతి సందర్భంగా పట్టణంలోని రేడియో బావి సమీపంలో గల సత్యసాయి మందిరం ఆవరణలో ఈ నెల 7వ తేదీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సమితి మండల కన్వీనర్ ఎస్.అనంతరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాతలు ముందుకురావాలని కోరారు.

22 నుంచి గజ్జలకొండలో దసరా నవరాత్రులు

మార్కాపురం: ఈనెల 22 నుంచి మార్కాపురం మండలం గజ్జలకొండలోని రాజరాజేశ్వరీ అమ్మవారి పీఠంలో దేవీ నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు శిరసనగండ్ల శ్రీనివాసశర్మ, చంద్రశేఖర శర్మ తెలిపారు. విశిష్ట అవతారాలతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తామన్నారు. 22న బాలా త్రిపురసుందరీదేవి, 23న గాయత్రీ దేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న లలిత త్రిపుర సుందరి, 26న మహా చండీ, 27న మహాలక్ష్మి, 28న సరస్వతీ దేవి, 29న దుర్గాదేవి, 30న మహిషాసుర మర్దిని, 1న రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. అదే రోజు సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కొమరోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొమరోలు, సర్విరెడ్డిపల్లె, పురుషోత్తమునిపల్లె, తాతిరెడ్డిపల్లె, కె.బొంతపల్లె, హనుమంతరాయునిపల్లె, కసినేపల్లె, గోహరపల్లె, కొత్తపల్లె, ఓబులాపురం, మలికేపల్లె, కూరాకువానిపల్లె, చింతలపల్లె, వర్ధనపల్లె, గోపాలునిపల్లె, బాదినేనిపల్లె, సూరవారిపల్లె, బొడ్డువానిపల్లె, మొట్టుపల్లె, బెడుసుపల్లె, రామావారిపల్లె, గుంతపల్లె గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

- ఆర్టీసీ ఈడీ నాగేంద్ర ప్రసాద్

మార్కాపురం: మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నెల్లూరు రీజియన్ ఆర్టీసీ ఈడీ నాగేంద్ర ప్రసాద్ స్థానిక అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మార్కాపురం డిపో, బస్టాండ్‌ను ఆర్ఎం సత్యనారాయణ, డీఎం నరసింహులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా డిపోలో ప్లాట్‌ఫారాల విస్తరణ, ప్రయాణికులు కూర్చునేందుకు బెంచీల ఏర్పాటు, తాగునీరు, వాష్‌రూములను అందుబాటులో ఉంచాలన్నారు. బస్టాండులో సీసీరోడ్లు, కాంపౌండ్ వాల్ తదితర నిర్మాణాల కోసం రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు డీఎం నరసింహులు ఈడీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే పనులు చేస్తామని చెప్పారు.


ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఈడీ నాగేంద్ర ప్రసాద్

బ్లాక్‌లో యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు

- సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: యూరియాను బ్లాక్‌లో అమ్మినా.. అధిక ధరలకు విక్రయించినా.. కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ త్రివినాగ్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ, పోలీసు, వ్యవసాయశాఖ అధికారులు, ఫెర్టిలైజర్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం యూరియా అవసరం ఎక్కువగా లేదన్న సాకుతో ఇక్కడి యూరియాను బ్లాక్ చేసినా, ఇతర ప్రాంతాలకు తరలించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అవసరమైన యూరియాతోపాటు ఇతర ఎరువులను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. ఏడీఏ బాలాజీ నాయక్, తహసీల్దార్ చిరంజీవి, పట్టణ ఎస్సై సైదుబాబు, ఏఓ బుజ్జిబాయి, టెక్నికల్ ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, ఏఈఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాదిలి రూరల్: పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారాన్ని అందించాలని సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. గురువారం పాదిలి మండలంలోని ఉప్పలపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహారం ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కులు, చైల్డ్ హెల్ప్‌లైన్ గురించి వివరించారు. కార్యక్రమంలో సఖి అడ్మినిస్ట్రేటర్ జ్యోతి, సోషల్ వర్కర్ సమాదానం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన


విద్యార్థులను సన్మానిస్తున్న వాసవి జాగృతి క్లబ్ సభ్యులు

గిద్దలూరు రూరల్: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 24వ తేదీన నిర్వహించిన కరాటే పోటీల్లో గిద్దలూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన భార్గవి, అభినయశ్రీ, గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో వాసవి జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో బాలికలను సన్మానించారు. కరాటే మాస్టర్ బూతరాజు, పాఠశాల ఉపాధ్యాయుడు సుభాన్‌ఖాన్, వాసవి జాగృతి క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సత్యఅనసూర్య



కొమరోలు: మండలంలోని గోపాలునిపల్లె ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ఉదయగిరి సత్యఅనసూర్య జిల్లా స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. కొమరోలు మండలంలోని మూలపల్లె గ్రామానికి చెందిన సత్యఅనసూర్య ఐదేళ్ల సర్వీసులో ఇప్పటి వరకు 27 రోజులు సెలవులు మాత్రమే తీసుకోవడం, విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుండటంతో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. శుక్రవారం ఆమె ఒంగోలులో అవార్డు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా ఆమెను మండలంలోని ఎంఈఓలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆదర్శనీయుడు 'సర్వేపల్లి'


గొట్లగట్టు జెడ్పీ పాఠశాలలో..

కొనకనమిట్ల: సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించాలని గొట్లగట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణ, మఠ్రిపాలెం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం ఆయా పాఠశాలల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించారు. ఆటలు, పాటల పోటీల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

- అటవీశాఖ డీడీ సందీప్ కృపాకర్


మాట్లాడుతున్న డీడీ సందీప్ కృపాకర్

మార్కాపురం టౌన్: విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన ముఖ్యమని మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జార్జి ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రేరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఇంజినీరింగ్ విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. తోటి విద్యార్థులతో మంచి రిలేషన్ ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ రాజబాబు, డీన్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.